



"శ్రీలు విలసిల్లు నా చిన్న దేశము,
కృష్ణ, గోదావరులున్న ప్రదేశము!"

"చిన్నమ్మగారు! చిన్నమ్మగారు!" అన్న పిలుపు వినబడటంతో ఆశుకవిత్వం ఆగిపోయింది. 'వెధవ గోల! కాస్సేపన్నా తీరిక ఉండి చావదు!'. స్వగతంలో తిట్టుకుంటూ లేచింది కన్య. పని మనిషి కన్నమ్మ వచ్చింది.

"పెళ్ళివారొస్తారంట గదమ్మా? మాయమ్మ చెప్పింది" అన్నది.

"అవునూ—పది గంటలకల్లా వస్తారని, ఇప్పుడా రావటం? ఈ పాటికి వస్తే సగం ఎండిపోయేది కదా? అయినా నువ్వొచ్చావేమే? మీ అమ్మ ఏం చేస్తోంది?"

"మా యమ్మ ఏా ఇంటి పెని బిజీగుతోంది" అన్నది కన్నమ్మ. ఎందుకో దాని మొహం సిగ్గుతో ఎర్రబడింది. తల వంచుకుని తిరిగి కోసం పెరట్లోకి వెళ్ళింది. నునుసిగ్గుతో గులాబి మొగ్గలా తయారైన దాని మొహం, ఒక్క క్షణం ముచ్చట కలిగించింది కన్యకి. మరు క్షణంలోనే ఆ సిగ్గెందుకో గుర్తుకు వచ్చేసరికి గుండెలో సన్నగా మంట బయలుదేరింది. తనకంటే అయిదారేళ్ళు చిన్నది అది. అప్పుడే దానికి పెళ్ళి, పేరంటమూ జరుగుతున్నాయి. పుట్టింది పాలి పని చేసుకుని బతికే తల్లి కడుపునే. అయినా అది పచ్చగా దబ్బపండులా నవనవలాడుతూ, నేవళంగా ఉంటుంది. అదే గనక తన స్థానంలో ఉంటే ఇంకెంత మెరిసిపోయేదో? ఒకపూట మజ్జిగ నీళ్ళుంటే, మిగతా రెండు పూటలూ ఉల్లిపాయ కారంతో తినవలసిందే. అయినా దాని ఆరోగ్యభాగ్యం ఎన్నతగింది.

మరి తనో? పొద్దున్న పూట పాలు. భోజనంలో గడ్డ పెరుగు. మధ్యాహ్నం టిఫిన్, కాఫీ. రాత్రి భోజనంలో పెరుగిష్టమైతే పెరుగు, లేకపోతే పాలు పోసుకుని తింటుంది. పైగా పెద్దగా ఒళ్ళు వంచి చేయవలసిన కష్టమైన పనులేవీ లేవు తనకు. ఇష్టమైతే చిన్న చిన్నపనులు చేస్తుంది. లేకపోతే అదీ లేదు. అయినా తన ఇరవై రెండేళ్ళ శరీరం ఎదిగిన తోటకూర కాడలా వేళ్ళాడి పోతుందే తప్ప నేవళం అనేదే లేదు. పొడుగ్గా, సన్నగా ఉండటం వల్ల నిజమైన వయస్సు చెప్పినా ఎవరూ నమ్మటం లేదు. ఎక్కడుంది లోపం? ఏమో? అయితే ఇక్కడ ఒక్క విషయం తప్పకుండా చెప్పి తీరాలి. కన్యమ్మ తల్లి దండ్రులకు రెండవ సంతానం. పైగా ఇద్దరూ మంచి దృఢకాయులే కావటం ఒక కారణం. అయితే కన్య తల్లి తండ్రీకూడా వాళ్ళంత దృఢమైన వాళ్ళుకాకపోయినా ఆరోగ్యవంతులే. ఆ మాటకు వస్తే, కన్య ఏమంత అనారోగ్యం మనిషి అనటానికి లేదు. నేవళం లేదన్న మాట మినహాయిస్తే మరే రోగమూ లేదు. పెద్ద అందగత్తె కాకపోయినా, చూడటానికి వికారంగా ఉండదు. అయినా కన్య ఎవరికి నచ్చటం లేదు. తన స్థాయికి తగినట్టుగా కట్నం ఇస్తానంటున్నా ఎవరూ ఒప్పుకోవటం లేదు. అమ్మ చెప్పినట్టు కల్యాణ ఘడియ రావటం లేదేమో? కాకపోతే ఏమిటి! తెలుగుకూడా సరిగ్గా చదవలేని సుగుణకు— పిల్లగా,

తాజా వార్తలకు
ఆంధ్రప్రభ దినపత్రిక

తెల్లని మెరిసే పళ్ళకు, గట్టి చిగుళ్ళకు
New FOAM ACTION


జెమిని
పళ్ళపొడి
వాడండి
ఉత్పత్తిదారులు: ఫోన్: 877
జెమిని కెమికల్ ప్రొడక్ట్సు
మచిలీపట్నం-521001
ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్స్:
జెమిని ఏజన్సీస్, ఫోన్: 209
రాబర్ట్సన్‌పేట, మచిలీపట్నం-1
స్టాకిస్టులు కావలెను
VIJAI

మీకు గుర్తులేదా?
పళ్లు, చిగుళ్ల ప్రపంచంలో ఒక కొత్త అద్భుతం
ఫ్లోరైడ్‌తో
ఫోర్‌హెన్స్ టూత్ పౌడర్

ఫ్లోరైడ్‌యుక్త ఫోర్‌హెన్స్ టూత్ పౌడర్ నిజంగా అద్భుతమైన టూత్ పౌడర్. ఇది ఆధునికమైనది. నురుగు నిచ్చేది. మెత్తటిది మరియు మృదువైనది. నియమానుసారం దీన్ని ఉపయోగించడం వల్ల పళ్లకు పరిశుభ్రత, చిగుళ్లకు మాలిష్ లభిస్తుంది. దాని ఫలితం గట్టి పళ్లు, ఆరోగ్యమైన చిగుళ్లు!

ఫోర్‌హెన్స్ టూత్ పౌడర్‌ను నియమానుసారం ఉపయోగిస్తే పళ్లు, చిగుళ్ల బాధలు ఉండవు. దంత వైద్యుడు సృష్టించిన ఫోర్‌హెన్స్ టూత్ పేస్ట్ ఉత్పత్తిదారులే దీనిని కూడా ఇప్పుడు తయారు చేశారు.




180 గ్రా., 90 గ్రా., 45 గ్రా. డబ్బాలలో లభిస్తుంది.
187 F 152 Tel

వికారంగా ఎత్తు పళ్ళతో ఉండే గుణకు మిష్టాల మీద పెళ్ళయి పోయింది. కట్నం ... ం లేదు. రెండువేలే. ఏదో గంతకి తగ్గ బొంత లాగా పెళ్ళి కొడుకు సుగుణకేమీ తీసిపోడు. అయినా తను అలాంటి వాడికికూడా నచ్చలేదు కదా!

మొన్న రాత్రి ఎనిమిది గంటలకు వచ్చి చూసి వెళ్ళిన ఆ పెళ్ళి కొడుకు అందానికి తనునచ్చలేదుట. నల్లగా తుమ్మమొద్దులా ఉన్నాడు. అదేదో పళ్ళ పొడి ఎడ్వర్‌టైజమెంటు లాగ నవ్వితే తెల్లగా మెరుస్తున్న పలు వరస. ఆ జుత్తు రంగే ఎక్కువో, ఆ వంటి రంగే ఎక్కువో చెప్పలేనంతటి చిక్కని గారంటీ రంగుతో, చూడగానే 'బాబోయ్! ఈ పురుష పుంగవుడి సేవ జీవితాంతమూ చెయ్యాలా, భగవాన్! రక్షించు!' అనుకున్నది తను.

"పిల్లవాడు నలుపైతే నేం లేరా! మంచి ఉద్యోగం ఉంది. బాదరబందీ ఏం లేదు. నచ్చితే ఇచ్చి చెయ్యి" అన్న బంధువులుకూడా ప్రత్యక్షంగా అతన్ని చూసి, మొహం చిట్లించారు. రైల్వే స్టేషన్ లోనే చెప్పిన అతని అభిప్రాయం విని తేలికగా నిట్టూర్చారే తప్ప బాధ పడలేదు. అసలు ప్రతి వాడికి ఇది ఒక పెద్ద రుగ్మతల్లే ఉంది. తనో తుమ్మ మొద్దయినా తన కోరంభ కావాలంటాడు. అంతటితో పూరుకుంటాడా! ఊహూ—పెళ్ళి చూపులంటూ వచ్చి ఎన్ని యక్ష ప్రశ్నలు వేస్తాడనీ! పిల్ల చదువుల సరస్వతేనా? అందంలో లక్ష్మీదేవితో సరిపోతుందా? అణుకువలో పార్వతీదేవి లాగానే ఉంటుందా? హావ భావాలతో అపర వూర్వశిని తల దన్నుతుందా? అని ఇన్ని ఆరాలు తీస్తాడు. కానీ, అన్ని సుగుణాలూ కలిగిన ఆ కన్యారత్నానికి సరిఅయిన జోడీగా, తను కనీసం, ఆ పిల్ల పక్కను నిలబడటానికైనా అర్హుడేనా! అని ఒక్కడంటే ఒక్కడు ఆలోచించడు. మగ పుట్టుక పుట్టడమె గొప్పఅన్నట్లుగా మాట్లాడతారు.

కన్నమ్మ వాళ్ళకీ తిప్పలు ఏమీ లేవు. చదువు ఇద్దరికీ రాదు. కనక ఆ ప్రసక్తే లేదు. ఇంక కట్న కానుకల విషయంకూడా అంత పట్టింపు ఉండదు. ముఖ్యంగా పెళ్ళి ఖర్చు తమకు ఉన్నంత ఉండదు. ఆడపడుచు లాంఛనాలనీ, వగైరా వగైరా లేముండవు. నిజంగా వాళ్ళెంత అదృష్ఠవంతులు కదా!

కన్య ఆలోచనలు సాగుతూండగానే కన్నమ్మ తిరగలి తెచ్చి, గోనె పట్టామీద వేసుకుని గంపలో పెసలు తెచ్చి పక్కను పెట్టుకుని, "సిన్నమ్మగారు! నూనె యిత్తారా?" అని అడిగింది.

కూర్చున్న చోటు నుంచి లేవాలంటే కన్యకు మహా విసుగ్గా ఉంది. అమ్మ, నాన్న గుడివాడ వెళ్ళారు కాబట్టి పెసలు విసిరించే బాధ్యత కన్యమీద పడింది. కన్నమ్మ అడిగిన నూనె ఏదో దాని స్వంతానికి పోస్తున్నట్లుగా విసుగుకుంటూ లేచి మంచి నూనె తెచ్చి దాని చేతిలో పోసింది. కన్నమ్మ ఆ నూనె అంతా పెసలకు బాగా పట్టించి విసరటం ప్రారంభించింది. కన్య నూనె సీసా లోపల పెట్టి వచ్చి దాని కెదురుగా చతికిల పడి "పెళ్ళెప్పుడే, కన్నమ్మా?" అని అడిగింది.

"ఛ! పొండి, అమ్మాయిగారు?" అన్నది కన్నమ్మ సిగ్గుతో మొహం గులాబీ రంగులోకి మారిపోగా.

దాని సిగ్గు చూస్తూంటే, కన్యకు ఎంతో ఉల్లాసంగా ఉంది.

"నా దగ్గర అంత సిగ్గెందుకే, చెప్పవే?" అని రెట్టించి అడిగేసరికి—

"మల్లొచ్చే పున్నమనాడు రేతిరికిట!" అన్నది తల వంచుకుని.

"కట్నం ఎంతే?" మరో ప్రశ్న.

"అయ్యన్నీ నాకు తెలీవండి !"

"అమాత్రం తెలియకుండా ఉండేమిటే? అన్నీ దొంగవేషాలు కాకపోతే! అది సరేగానీ, కన్నమ్మా! మీ రిద్దరూ ప్రేమించుకున్నా రేమిటే—సినిమాలో లాగా?" రహస్యంగా అడుగుతున్నట్టు అడిగింది కన్య.

"ఛీ! పొండమ్మాయిగారూ. సినిమాల్లోలాగా మనె మెట్టా ఉంటాము?" అన్నదే కానీ కన్నమ్మ అసలు విషయం చెప్పలేదు. కన్యకు ఆరాటంగా ఉంది. చక్కగా కథల్లోలాగా, సినిమాల్లోకి మల్లే కన్నమ్మ ఉన్న వూళ్ళోనే, వరసైన వాడినే పెళ్ళాడబోతున్నది. ప్రేమించకుండా ఎట్లా ఉంటుందీ? ఆ సంగతి క్షుణ్ణంగా తెలుసుకుంటే, తనొక చక్కని ప్రేమ కథ వ్రాయవచ్చు. అందుకే కన్నమ్మని వదలలేకుండా ఉన్నది. మళ్ళీ మళ్ళీ అడిగేసరికి ఉన్న విషయం చెప్పక తప్పలేదు కన్నమ్మకు.

"ప్రేమ వూసులాడటానికి మాకేటి టయి ముంటుంది? తెల్లారి లేగిసిన గాణ్ణుంచి, ఏదో ఒక పని ఉంటూనే ఉంటుందికదా? అయినా మొన్న మొన్నటిదాకా మా ఇద్దరికీ పెళ్లి అని అనుకోలేదు

## శ్రీమతి ఎమ్. ఎల్. ఎస్. మణి

పద్దినాలనాడు మా యమ్మకీ ఆలోచన వచ్చి, భీముడి మామని అడిగితే సరేనన్నాడు. అంతే. అంతకుమించి ఏటీ పత్యేకం లేదు. మనువు అనుకున్న కాణ్ణుంచి, ఆడు నాకంట బడలేదు. నే నాడికంట బడలేదు."

అన్న కన్నమ్మ జవాబుతో కన్య హుషారు కాస్త చచ్చి వూరుకుంది. కన్నమ్మ ఏమన్నా రసవత్తర ఘట్టం గురించి చెపుతుందేమో, దానికి చిలవలు పలవలు చేర్చి చిన్న కథ వ్రాయవచ్చన్న ఉత్సాహపు పొంగుమీద ఎవరో ఇన్ని సున్నపునీళ్ళు చిలకరించి నట్లయింది.

పోనీ, కన్నమ్మ అబద్ధం చెపుతున్నదేమో ? అనుకోవటానికి ఆస్కారంలేదు. కన్య ఒకసారి కన్నమ్మావాళ్ళ ఇళ్ళవేపు వెళ్ళింది. అన్నీ ఒకదానిమీద ఒకటి కలగా పులగంగా ఉంటాయి. పిల్లా జెల్లా అంతా అక్కడే ఉంటారు. ఆ వాతావరణంలో ఇద్దరు ప్రేమికులు ఏకాంతంగా మాట్లాడుకోవ టానికి చోటు దొరకదు. కన్నమ్మ చెప్పినట్లు అవ కాశం తక్కువే. పోనీ, ఏ తోటలోనన్నా మాట్లాడు కుంటారా అంటే, తమ వూరిలో తోటలే లేవు. ఏకాంతానికి అనువైన ఏరులు లేవు. కన్నమ్మా వాళ్ళకు, కుమ్మర్లకీ, చాకళ్ళకూ, మంగలి మొద లైన అందరికీ కలిపి, నాలుగు వీథుల మధ్యలో ఒక పెద్ద బావి ఉన్నది. అందులో నీళ్ళే వాళ్ళకు అన్ని అవసరాలకూ ఆధారం. ఆ నూతి ఒడ్డున ఏకాంతమనేది కంచుకాగడా పెట్టి వెతికినా దొరకదు. వీటన్నిటివల్లా కన్నమ్మ నిజమే చెపు తున్నదని కన్య నిర్ధారణకు వచ్చి, అక్కడినించి లేచి తన మంచంమీద పడుకుని, తను ఇందాక వ్రాసిన రెండు పంక్తుల కవితను పూర్తిగా వ్రాయాలని ప్రయత్నించింది. కానీ తిరిగిరి మోతలో భావసంచలనం బండబారి పోతున్నది. పైగా కమ్మని కవిత్వం కట్టాలంటే, కల్మషం లేని హృదయం ఉండాలి. కన్య మనసులో కన్నమ్మ పెళ్ళి తాలూకు రేగిన పొగలు చల్లారినా, సెగ ఇంకా పచ్చిగానే ఉంది. దానివల్ల కూడా కన్య కవిత వ్రాయలేకపోయింది.

చేసేందుకు పెద్దగా పనేమీ లేకపోవటంతో కవితలు, కథలు, కాకరకాయలు అంటూ కన్య కాగితాలకు కా‌తాలు నింపి, వాటిని కవర్లలో పెట్టి పంపుతూ పోస్ట్‌వాళ్ళను బాగు చేస్తూ ఉంటుంది. వంద కథలు పంపితే ఒక్కటి అచ్చు మొహం చూస్తూ ఉంటుంది. అప్పయిన ఆ ఒక్కటే, కన్యలోని కవితాత్మకు వూపిరి పోస్తూ ఉంటుంది. అదే ప్రస్తుతం కన్య వ్యాసంగమూ, వ్యాపకమూను.

• • •

వైశాఖ పూర్ణిమ. పదహారు కళలతో పండిన చందమామ పకపకలాడుతూ వెన్నెలను వెదజల్లు తున్నాడు. మబ్బు తునక మచ్చుకన్నా లేని నీలా కాశంలో తారకలు తళతళ లాడుతున్నాయి. ఆరు బయట మంచాలమీద పడుకున్న వారంతా ఆద మరిచి నిద్రబోతున్నారు. కన్యకే నిద్ర రావటం లేదు. దూరంగా ఉండి ఉండి సన్నాయి మేళం, గాలివాటం ఇటు విసిరినప్పుడల్లా, మైకులో సినిమా పాటలు వినిపిస్తున్నాయి. ఆ హడావిడంతా కన్నమ్మ పెళ్ళి సందడే !

నిన్ననే భీముడు వచ్చి శుభలేఖ ఇచ్చి వెళ్ళాడు. కన్నమ్మ పేరు 'కన్నాంబ'గాను, నాన్నన్న పేరు, నాగేశ్వరరావు'గాను శుభలేఖలో వేయించారు. భీముడికి నాలు గెకరాల పొలం, రెండెడ్ల జతలు, ఉండేందుకు పెంకుటి మండువా లోగిలి ఉన్నాయి. అక్కడ ఉన్న వాళ్ళందరిలో భీముడే స్థితిపరుడు కింద లెక్క. అందుకే నాలుగవ కొడుకు నాగేశ్వరరావుకు నాలుగు వందలు కట్నం తీసుకుని ఉన్న వూళ్ళోని పిల్లే కావటం వల్ల మాంచి జోరుగా పెళ్ళి చేస్తున్నాడు.

అప్పుడే వరహాధనిలా ఉండే కన్నమ్మ పెళ్ళి కూతురుగా ఇంకెంత మెరిసి పోతున్నదో! చూడాలని మహా ఉత్సుకతగా ఉన్నా కాలు కదపలేకపోయింది కన్య. దానికి కారణం అంతస్తుల భేదం కాదు, కులమూ కాదు. కన్నమ్మ పెళ్ళి చూసి వస్తానంటే అమ్మా నాన్నలు కాదు అనరు. మరేమిటే అంటే, అదే—కన్యమనసు లోని బాధే కన్యను కదలనియ్యలేదు.

తనకంటే కన్నమ్మా చాలా చిన్నది. నాగన్న రెండేళ్ళు చిన్నవాడే. వాళ్ళిద్దరు తనకు నమస్కారం చెయ్యవచ్చు. చెయ్యవచ్చేమిటి! తప్పకుండా చేస్తారు కూడా! వయస్సులో తను పెద్దదైనా, వాళ్ళ నిండు తన కెక్కడిది? వాళ్ళ పరిపూర్ణత ముందు తను వెలా తెలా పోతుంది. అదెట్లా భరించ గలదు తను? అందుకే కన్య వెళ్ళలేదు. కళ్ళు మూసుకుని అంతర్నేత్రంతోనే వాళ్ళ పెళ్ళి చూడసాగింది కన్య.


మీకుపయోగించేది

ఇంట్లో ఎవరికేరోగంవచ్చినా కంగారు పడేపనిలేదు. ఐదురకాల ప్రఖ్యాతవైద్యులు ప్రతిరోగానికి, రోగలక్షణాలు, వాటి నివారణకు ఇంగ్లీషు, ఆయుర్వేద, ప్రకృతి, మూలిక, హోమియో మందులు, "ఐదువైద్యవిధానాలు" అనే తెలుగు పుస్తకంలో అందరికీ తెలిసేలా వ్రాశారు. అన్నీ షాపుల్లో దొరికే మందులే. 427 రోగాలు నయము చేసుకొనేమార్గాలున్నాయి. వెలరూ. 16. పోష్టు ఖర్చులదనం. దేశసేవప్రచురణలు, 5/3 ఆర్‌టీ. పంజాగుట్టకాలని, హైదరాబాదు-4 కు, మాకో పుస్తకం వి.పి. పోష్టులో పంపుమని వెంటనే వ్రాయండి.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేచనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!

మీకు బేబి / బాబు కావాలా



...వైద్య చికిత్సలో ... చెందిన ... అనేకుల మా ... సౌభాగ్యతా... కలవు. స్త్రీ పురుష వంధ్యాదోషనివా రణ నిపుణులు

శ్రీ నాగార్జునమూలికకుటీరం
రైల్వే స్టేషన్ వద్ద. రామాలయం వీధి.
తెనాలి - 2

వార్తలకు, వ్యాఖ్యలకు, స్వతంత్ర భావ ప్రకటనకు
అందరూ అభిమానించే దినపత్రిక

ఆంధ్రప్రభ




మెజెస్టిక్ లోని చిన్న విడి భాగాలు కూడా మీకు నాణ్యతనిస్తాయి

స్క్రూలు, తదితర చిన్న విడిభాగాలు ఇతర కుకర్లలో ప్రాముఖ్యత కలిగి ఉండకపోవచ్చు. కాని, మెజస్టిక్‌లో అలాకాదు. స్టెయిన్‌లెస్‌స్టీలు స్క్రూలు, ఇత్తడితోచేసిన ఇతర చిన్నభాగాలు కూడా మెజెస్టిక్‌కు ఘనతనిస్తాయి. స్క్రూలు తుప్పుపట్టవు గనుక కుక్కర్‌ను విరగకొట్టి మరొక హ్యాండిల్ అమర్చవలసిన అవసరం వుండదు.

ఇతర ఆకర్షణలు :

- ఐ.ఎస్.ఐ. గ్రేడు అల్యూమినియం అలాయ్‌తో చేయబడింది.
- మీరు ఎంపిక చేసుకోడానికి వైరుస్టాండుతో గిన్నెల సముదాయం.
- 4 నుంచి 12.5 లీటర్లవరకు ఏడు సైజులున్నాయి.
- అందమైన 4 రంగులలో కూడా లభిస్తాయి.



మెజెస్టిక్®
ప్రెషర్ కుకర్
అన్నిటిలోకి శ్రేష్ఠమైనది

ASSOCIATED/MA/ 2857

ఆ భావాంబర వీధిలో విహరిస్తున్న కన్యను నిద్రా దేవత ఎప్పుడు లాలి పాడిందో తెలియదు.

పెళ్ళి అయినప్పటినుంచి కన్నమ్మను చూడాలని మహా ఆత్రతగా ఉంది కన్యకు. కానీ, కన్నమ్మ ఎక్కడా బయటికి రావటం లేదు. ఎవరినైనా అడగాలంటే ఏమనుకుంటారో అని సిగ్గుగా ఉంది. కానీ కన్య కోరిక విచిత్రంగా తీరిం దొకనాడు.

అర్ధరాత్రి మెలకువ వచ్చిన కన్యకు మరి నిద్ర

## అంతరిక్ష మౌళి

ఏ వేద వీణ లొక్క
వేణువులో పలికించే
బృందావన స్వామి, నా
డెందము లోనే నిలిచె-

వెర్రినయ్యి నే నాతని
వెదకితి యమునా తటిపై
శో కించితి అతనికై
చీకటి కంకటిపై-

ఊహల రాడారు వేసి
ఉడు పథాలు గాలించితి
అంతరిక్ష మౌళిని నా
అంతరంగమున కంటి-

ఎచట ప్రేమ వికసించునో
అచట తాను పరిమళించు
ప్రేమించిన వా రందరి
ప్రియతముడై పలకరించు-

ఒక్కరి ప్రేమించ తగిన
శక్తి లేని దాన నేను
ఎందరి ప్రేమార్తులైన
అందుకొనే స్వామి అతడు-

- జె. బాపురెడ్డి

పట్టలేదు. అమావాస్య ఇంక ఆరు రోజులే ఉండటం వల్ల అర్ధ రాత్రి దాటినాక ఇప్పుడే చంద్రోదయ మవుతున్నది. ఆ కమనీయ దృశ్యా న్నవలోకిస్తూ అట్లాగే పడుకుండి పోయింది కన్య.

చల్లని పిల్లగాలి. తెల్లని పాల వెన్నెల. సున్నితంగా కొబ్బరిఆకుల పరసరలు. కన్నెపిల్లకు నిద్ర పట్టక పోవటానికింతకంటే ఏమి కావాలి? కానీ కన్యకు జ్ఞప్తిలో ఉన్నది తన స్థితి కాదు. కన్నమ్మ ఇప్పుడేం చేస్తున్నదో? పాపం! కమ్మగా వెన్నెల ననుభవించ టానికికూడా వాళ్ళు నోచుకోలేదు కదా? అందరూ వీధిలో పడుకుంటే వాళ్ళు వెన్నెల ఇంట్లో ముగ్గు తున్నారేమో? అనుకుంటున్న కన్య ఆలోచనలకు

చిందర వందర చేస్తూ చిన్నగా మాటలు, పద ధ్వనులు వినరావటంతో కుతూహలంగా వీధి తలుపు తీసి చూసింది. రెండవ ఆట సినిమా చూసి జట్లు జట్లుగా పోతున్నారు జనం. వేసవి కాలం వెన్నెల రాత్రులు—వాళ్ళ కిది అలవాటు. పగలంతా ఒళ్ళు హూనం అయ్యేటట్లుగా పని చేసినా వెన్నెలలో అయిదు మైళ్ళు నడిచి గుడివాడ వెళ్ళి సినిమా చూసి, మళ్ళీ అయిదు మైళ్ళు నడిచి ఇళ్ళకు వచ్చి ఒళ్ళు ఆగకుండా ఏ రెండు మూడు గంటలో నిద్ర పోయి లేచి, యథాప్రకారం పనిలో చొరబడటం అందరికీ అలవాటే. అయితే, పాపం! వెన్నెలను అనుభవించలేక పోతున్నారేమో? అని కన్య బాధ బాధ పడిన కొత్త జంట కన్నమ్మ, నాగేశ్వరావులు అందరి కంటే చివర ఒకరి చెయ్యి మరొకరు పట్టుకుని నవ్వుతూ, తుళ్ళుతూ పోతున్నారు. పిండి ఆరబోసినట్లున్న వెన్నెల్లో బంగారు బొమ్మ ల్లాగా మెరిసిపోతున్న ఆ జంటను కనుల విందుగా కన్నార్పకుండా కనుమరుగయ్యేవరకు చూసి, తలుపు వేసి, తనపడక మీదికి చేరింది కన్య.

ఆ కొత్త దంపతుల ఆనందం ముందు, ఏ హనీమూన్ తులతూగుతుంది? అవును. సృష్టికర్త అందరికీ అప్పనంగా ఇచ్చిన ఈ ఆనందాన్ని అనుభవించక 'హనీమూన్' అని డబ్బులు ఎక్కువగా ఉన్నవాళ్ళు దూరపు కొండలు నునుపు' అన్న సామెత లాగా [illegible] ఎక్కడికో పోతారు. చదువు సంధ్యలు లేని [illegible] వీళ్ళు. వీళ్ళకు అవన్నీ ఎక్కడి నించి [illegible] యని ప్రకృతి మాత తన సహజ [illegible] సంపదను వీళ్ళ కోసమే వెల్లువగా వెదజల్లింది. అది వాళ్ళు ఆప్యాయంగా అందుకుని తనివితీరా జుర్రుకుంటున్నారు. నిజంగా వాళ్ళు ధన్యులు.

* * * *

కన్నమ్మను పగలు చూడకుండానే కన్య హైదరాబాద్ వెళ్ళవలసి వచ్చింది. ఎవరో వచ్చి చూస్తారని [illegible] అన్నగారు వచ్చి కన్యను తీసుకుని వెళ్ళాడు. సంబంధం కుదరలేదు. కానీ, కన్య టెయిలరింగ్‌లో చేరి అక్కడే ఉండిపోయింది.

సంవత్సరం తరవాత మళ్ళీ తమ గ్రామం వచ్చేసింది. వూళ్ళో ఉన్న మహిళామండలిలో మిషన్ కుట్టు, బట్టల కత్తిరింపు నేర్పుతూ కాలక్షేపం చేస్తున్నది కన్య. వూరు రాగానే కన్నమ్మ గుర్తుకు వచ్చింది కన్యకు. కబురు చేయగా కన్నమ్మ కూతుర్ని చంక నేసుకుని వచ్చింది. తల్లి లాగానే పచ్చగా ఏకులాగా ఉన్నది పాప. కన్నమ్మ ఇంకాస్త నిగారింపుతో నిండుగా ఉన్నది. వాడ్ని ఆయన పాచి పని చెయ్య వద్దన్నాడట. పొలం పనులకు అవసరముంటే తప్ప వెళ్ళడం లేదు. లేకపోతే ఇంట్లోనే ఉంటున్నదిట. దాని కూతురుకు ఒక గౌను కుట్టి ఇచ్చింది కన్య. కన్నమ్మ వెళ్ళిపోయింది.

మళ్ళీ పెళ్ళివారు రావటం, చూడటం, వెళ్ళటం ఈ చక్రభ్రమణంలో గిరగిర తిరిగి పోతున్నది కాలం. కొంతమంది పెళ్ళి వారు వచ్చులేదంటే, మరి కొంతమంది చదువు ( ఇంగ్లీషు ) లేదని పోతున్నారు. ఇంకొంతమంది జాతకాలు కుదరలేదండీ. కట్నం చాలదని మరి కొంతమంది. ఇట్లా రకరకాలుగా వస్తున్న అభిప్రాయాలను వింటూ అనుభవాన్ని పెంచుకుంటున్నది కన్య.

కాలచక్రంలో మరో మూడేళ్ళు తిరిగిపోయాయి. కన్య స్థితిలో ఏ మార్పూ రాలేదు. కానీ, కన్నమ్మ ముగ్గురు ఆడపిల్లల తల్లి అయింది. "ఒక మగ నలుసు కలగ్గానే ఆపరేషను చేయించుకుంటాను. ఈ పిల్ల మూకతో ఏగలేకపోతున్నామండి అమ్మాయిగారూ!" అన్నది కన్నమ్మ. కన్నమ్మ అదృష్టవంతు రాలని మరొకసారి అనుకున్నది కన్య. కానీ, కన్య దృష్టి తగిలిందా అన్నట్లు, కన్నమ్మకు కష్టాలు ప్రారంభమయ్యాయి. దానికి మళ్ళీ నెల తప్పిందట.

"ఈ సారి దాని రాత బాగులేదమ్మ! నాగులు గాడు చీట్ల పేక ఆడుతున్నాడు. అప్పులు తెగ చేస్తున్నాడు. వాళ్ళయ్య భాగాలు పంచేశాడు. నాగులుగాడి భాగానికి అర ఎకరం పొలం వచ్చింది. అప్పుడే కుంట పొలం అమ్మేశాడు. కన్నమ్మ రోజువారీ కూలికి వెడితేనే కూడు గడుస్తుంది. లేకపోతే లేదు" అని కన్నమ్మ తల్లి కన్య దగ్గర వాపోయిం దొకనాడు.

కన్య మనసు బాధతో మెలికలు తిరిగింది. 'తను పెళ్ళో పెళ్ళో అని కలవరించి పోతున్నది. పదిహేనవ ఏటనే పెళ్ళి చేసుకున్న కన్నమ్మ ఏం సుఖపడుతూంది? ఎందుకీ తాపత్రయం? పెళ్ళి ఒక్కటేనా ఆడదానికి జీవితావసరం? పెళ్ళి కాకుండా జీవించలేదా? ఎట్లా జీవించాలి? నలు వైపులా కాకుల్లాగా పొడిచే కాలకూట విషం లాంటి ఈ సంఘంలో ఎట్లా బ్రతకాలి? పాపం! ఇంకా పెళ్ళి కాలేదుట! అని ముక్కు మీద వేలు వేసుకునే వారందరూ తనకు గుప్పెడు మెతుకులు పెట్టక పోయినా గుండె మండే సానుభూతి చూపిస్తారు. అయినా తనకు ఒకళ్ళ మీద ఆధారపడవలసిన గతి ఎందుకు పట్టాలి? హుఁ ఎవరి మీదా ఆధార పడకుండా బ్రతకటానికి తనేమన్నా చదువుకుందా! అయిదవ తరగతి వరకు ఉన్న తమ వూరి బడిలో మూడు సార్లు ఆ అయిదవ తరగతినే చదివింది. అంతే. అంతలోనే పెద్దమనిషి అయింది. ఇక చదువులేదు, చట్టు బండలు లేదన్నారు పెద్దలు. అయినా మగ పిల్లలే నానా అవస్థ పడి అయిదు మైళ్ళు నడిచి గుడివాడ వెళ్ళి, చదువుకు వస్తున్నారు. అంత దూరం ఆడపిల్లనేం పంపిస్తారు? అలా పంపించే అలవాటు లేదు. పెళ్ళి చెయ్యాలని ప్రయత్నాలు చేశారు. చేస్తున్నారు. ఆ యోగం తనకు ఉన్నట్లుగా లేదు. ఇక తనే విధంగా బ్రతకాలి? తోడబుట్టిన అన్న దమ్ములు, అక్క చెల్లెళ్ళు ఎవరికి ఏ అవసరం వచ్చినా వారి ఇంటికి వెళ్ళి ఆ అవసరం గడిపి మళ్ళీ అమ్మా నాన్నల దగ్గరికే చేరుతూంది. వాళ్ళు ఉన్నంత కాలం తనకే బాధా లేదు. వాళ్ళ తరవాత తను ఎవరి నెత్తిని పడాలో! వస్తువుల ధరలన్నీ మండిపోతున్న ఈ రోజుల్లో అదనంగా ఒక మనిషిని భరించాలంటే ఎవరికైనా బాధ కదా? మరి తను ఎక్కడ ఉండాలి?' కన్య మనస్సులో తీవ్రంగా తర్జన భర్జనలు జరుగుతున్నాయి.

'లాభం లేదు. తను పిరికితనం వదిలేసి ధైర్యంగా ముందడుగు వెయ్యాలి'. కన్యకు చటుక్కున అంత క్రితం గ్రామసేవిక చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. కుటీర పరిశ్రమ పథకం కింద మేలు రకం కోడిగుడ్లను మహిళామండలులకు సరఫరా చేస్తారుట. అవికాక ఆవిడ కొన్ని విత్తనాలను, కారెట్ లాటి దుంపకూరలను తెచ్చి ఇస్తానంది. అవి తను తీసుకుని కాంపౌండ్ వాల్ లేక, అడ్డదిడ్డంగా పిచ్చి మొక్కలతో పురుగూ పుట్రా చేరటానికి సిద్ధంగా ఉన్న తమ దొడ్డిని బాగుచేసి కూరలు పెట్టాలి. కోళ్ళను పెంచటానికి తగిన చర్యలు తీసుకోవాలి. వీటన్నింటికి తనకు అన్ని వైపుల నుంచి అడ్డంకులే వస్తాయి. కానీ ఎవరి దగ్గర నుంచీ ప్రోత్సాహం రాదు.

'ఒక్క గ్రామసేవిక తప్ప తనకు అండగా ఎవరూ ఉండరు. తన ధైర్య సాహసాలే తనకు శ్రీరామరక్ష' అని నిశ్చయించుకున్నది కన్య. అంతలోనే కన్యకు కన్నమ్మ గుర్తుకు వచ్చింది. అవును—రోజు వారీ కూలికి వెళ్ళే బదులు కన్నమ్మ తనకు సహాయంగా ఉంటే తనకూ ధైర్యంగా ఉంటుంది. అందులో కోళ్ళ పెంపకంలో కన్నమ్మది అందె వేసిన చెయ్యి అని వాళ్ళమ్మ ఎప్పుడూ చెబుతూనే ఉంటుంది. ఇంకేం? కన్నమ్మతో ఇప్పుడే వెళ్ళి చెప్పివస్తాను' అని భవిష్యత్ మీద కొండంత ఆశ పెట్టుకుని కన్నమ్మ ఇంటి వైపు బయలుదేరింది కన్య. ★

ఓ చందమామ ఇటు చూడరా! —జి. సుజాత ( సికిందరాబాదు )

